క్లుప్తంగా

ప్రజా పోరాటాలే లక్ష్యంగా పని చేద్దాం

సామర్లకోట: ప్రజా పోరాటాలే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. సీపీఐ 9వ డివిజన్ శాఖ సమావేశం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యానారాయణ అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ పేదలకు గూడు కల్పించే లక్ష్యంతో సీపీఐ అనేక భూ పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా నిర్వహించిన ఈ కార్యక్రమం విశిష్టతను ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.అరుణ అధ్యక్షత సైన్సు ఉపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయులు ఎన్.దుర్గేశ్వర్, జి..హర్షవర్ధన్ తయారు చేసిన చంద్రయాన్ నమూనాలు ఆకట్టు కున్నాయి. ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, సీహెచ్‌వీ భద్రమ్మ, కె.శేషారత్నం పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని అవమానించారు

పి.తిమ్మాపురం సర్పంచ్ సన్యాసినాయుడు

పిఠాపురం: ఉపాధి హామీ పనుల కోసం శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో అధికారులు పంచాయతీ పాలక వర్గాన్ని తీవ్రంగా అవమానించారని మండలం పి.తిమ్మాపురం సర్పంచ్ పైలా సన్యాసినాయుడు ఆరోపించారు. పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన గ్రామసభను కొందరు టీడీపీ నేతల ఆదేశాలతో అధికారులను పక్కనపెట్టి నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించాలని కోరుతూ ఎంపీడీఓకు తనతో పాటు మెజారిటీ వార్డు మెంబర్లు ఫిర్యాదు చేసినా సర్పంచ్ వార్డు సభ్యులు లేకుండా టీడీపీ నేతలతో గ్రామ నిర్వహించి ప్రజా ప్రతినిధుల హక్కులను కాలరాశారన్నారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తుంటే జిల్లా స్థాయి అధికారులు కూడా పట్టించుకోడం లేదని, తమ హక్కులకు భంగం కలిగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నాగులపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు ఈవో పీఆర్డీ భాస్కరరావు తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం, రికార్డులు నిర్వాహణ సంక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో ఇటీవల విచారణ నిర్వహించి చెక్ పవర్ రద్దు చేసిన విషయం విధితమే. ఈ మేరకు సర్పంచ్ కలెక్టర్‌కు అపీల్ చేయడంతో ఎన్నికల ముందు చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. మళ్లీ నిర్వహించిన విచారణలో భాగంగా ఆరు నెలల పాటు రద్దు చేస్తూ డీపీఓ ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు మెగా జాబ్‌మేళా

పిఠాపురం: వికాస ఆధ్వర్యంలో శనివారం పిఠాపురం ఎస్ఎఫ్ఎస్ స్కూలులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 40 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని సుమారు 2500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని ఆయన తెలిపారు. అర్హతలు ఉన్న వారు శనివారం ఉదయం 9 గంటలకు పిఠాపురం ఎస్ఎఫ్ఎస్ స్కూలులో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలని ఆయన కోరారు.

అనకాపల్లి ఫ్యాక్టరీలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

పెద్దాపురం: అనకాపల్లి సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనపై తక్షణమే ఫ్యాక్టరీలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. స్థానిక ఏడీబీ రోడ్డు వాలు తిమ్మాపురం జంక్షన్‌లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల యాజయాన్యాలు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాల ఆర్జనకు నాసిరకం యంత్రాలను వినియోగిస్తూ ఎందరో ప్రాణాలు తీస్తున్నారన్నారు. సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్ తదతరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిన్నట్లు ఎస్సై పీవీఆర్‌కే మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని గుర్తించి శుక్రవారం కాకినాడ కోర్టుకు తరలించినట్లు ప్రకటనల పేర్కొన్నారు. ఈ మేరకు రెండో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాసు మెజిస్ట్రేట్ వి.నరసింహరావు ముగ్గురు వ్యక్తులకు రెండు రోజుల పాటు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.



మహిళా సిబ్బందికి రక్షణ ఉండాలి

ఆస్పత్రుల్లోని డాక్టర్లు, మహిళా సిబ్బందికి రక్షణ లేదు. మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా శిక్షించాలి. ప్రతి ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. దీనికి తోడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో 50 శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. వీరు రాత్రి సమయంలో కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహిళా సిబ్బందికి రక్షణ లేక పోతే విధులు నిర్వహించడం కష్టంగా మారుతుంది.

– డాక్టరు నూనె మాధురి, సామర్లకోట



మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ప్రభుత్వాలు మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి. ఉద్యోగులపై దాడి చేసిన వారిని తక్షణచే అరెస్ట్ చేసి వారిని కఠినంగా శిక్షించాలి. శిక్ష అనేది మరో వ్యక్తి తప్పు చేయడానికి భయపడేలా ఉండాలి. అప్పుడే మహిళలకు భద్రత కల్పించినట్లు.

– సౌజన్య, నాగులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తపల్లి



ఏఆర్వీ ఉందిగా.. ఫరవాలేదు!

- కుక్కల దాడులపై అధికారుల తీరిదీ
- వాటి సంతతి నియంత్రణలో విఫలం
- ఆందోళన కలిగిస్తున్న కుక్క కాట్ల కేసులు



విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడిన బాధితుడు (ఫైల్)

పిఠాపురం: గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. తమను చంపే అధికారం ఎవరికీ లేదనుకుంటున్నాయో ఏమో దొరికిన వారందరిపైన దాడులు చేస్తున్నాయి. ఫలితంగా అనేక మంది కుక్కకాట్లకు గురై ప్రాణాపాయస్థితిలో వైద్య కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఆర్వీ ఇంజెక్షన్లు కొరత లేకుండా చూడడం తప్ప కుక్కకాటు నివారణ చర్యలు తీసుకోవడం లేదు. మీరు కుక్కతో కరిపించుకు రావడమే తరువాయి మేము ఇంజక్షన్ చేస్తాం అంటున్నట్లుగా ఉంది అధికారుల తీరు. కుక్కల నియంత్రణపై దృష్టి పెట్టకుండా ఏఆర్వీ కొరత లేకుండా చూస్తే చాలన్నట్టుంది అధికారుల తీరు. నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వివిధ గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకి పెరుగిపోతుంది. జిల్లాలో అనేక మంది కుక్కకాటుకు గురై మృత్యువాత పడగా హడావుడి చేసిన అధికారులు మళ్లీ పట్టించుకోవడం మానేసారు. నియోజకవర్గ పరిధిలో నిత్యం 35కు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. పిఠాపురంలో సీహెచ్‌సీ, కొత్తపల్లి, విరవ, గొల్లప్రోలు, కొమరగిరి, పీహెచ్‌సీల్లో ఏఆర్వీల కొరత లేనప్పటికీ కుక్క కాట్లు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి.

నియోజకవర్గంలో ఆస్పత్రులు

సీహెచ్‌సీ	1
యూపీహెచ్‌సీలు	3
పీహెచ్‌సీలు	7
వీధి కుక్కలు	34 వేలకు పైనే
కుక్క కాటు బాధితులు	నెలకు సుమారు 300 పైగా...

గర్భనిరోధక చర్యలు శూన్యం

కుక్కలకు గర్భనిరోధక చర్యలు తీసుకోకపోవడంతో ప్రతి గ్రామంలోనూ వాటి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కుక్కలను చంపకూడదన్న నిబంధనలు ఉండడంతో వాటి సంతతి భారీగా వృద్ధి చెందుతూ ప్రజలు, పిల్లలపైనా, పాదచారులు, వాహన చోదకులపైనా పడి దాడి చేస్తూ ప్రాణాంతకంగా మారుతున్నాయి.

పెరిగిన కుక్కల సంతతి

గడిచిన ఏడాదిగా నియోజకవర్గంలో సుమారు 50 వరకు గేదె దూడలు కుక్కకాటు వల్ల చనిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్క గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో విలువైన 20 గేదె దూడలపై దాడి చేసి చంపేసినట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పిఠాపురం మున్సిపాలిటీలోనే సుమారు 2 వేలకు పైగా కుక్కలున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది.

ఆపరేషన్లు చేస్తే దాడులు ఆగుతాయా?

ఆపరేషన్లు చేస్తే కుక్కల సంతతి వృద్ధి చెందకుండా ఉంటుంది తప్ప దాడులు ఆగే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా వాటిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేయాలి. ఒక్కో బోనులో ఐదు కుక్కలను మాత్రమే తీసుకెళ్లి ఆపరేషన్ చేసే వీలుంటుంది. అలాగే వాటికి ఆపరేషన్ పూర్తయ్యాకా సుమారు ఐదు రోజులు వాటిని గమనిస్తూ అవసరమైతే వైద్య సేవలందించాలి. అప్పటి వరకు ఆ కుక్కలను బోనులోనే ఉంచాలి. అలా ఐదు రోజుల వరకు బోనులు ఖాళీ కాకపోతే గ్రామాల్లో ఉన్న వందల కుక్కలకు ఆపరేషన్లు పూర్తి కావాలంటే కొన్ని నెలలు పడుతుంది. ఇంతలో సుమారు 100 కుక్కలు సంతానోత్పత్తి చేసినా ఒక్కో కుక్క సగటున నాలుగు పిల్లలను పెట్టినా మరో నాలుగు వందల కుక్కలు పెరుగుతాయి.

ప్రాణాలు పోతున్నా పట్టింపు లేదు



నిత్యం కుక్కల దాడిలో పలువురు గాయపడుతున్నా ఎవరు పట్టించుకోడం లేదు. కుక్కల దాడుల వల్ల రేబిస్‌తో సోకడంతో పాటు ప్రాణాల మీదకు వస్తోంది. కుక్కలకు భయపడి పరుగులు తీయడం వల్ల గాయాలపాలవుతున్నారు. అధికారులు మాత్రం నిబంధనల పేరుతో తప్పించుకుంటున్నారు.

– దువ్వ దిలీప్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, గొల్లప్రోలు

‘ఎసెన్షియా’ బాధిత కుటుంబానికి పరిహారం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేసిన తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి

సామర్లకోట: అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన సామర్లకోట వాసి, అసిస్టెంట్ మేనేజర్ మొండి నాగబాబు కుటుంబానికి అధికారులు శుక్రవారం రూ.కోట పరిహారం చెక్కును అందజేశారు. శుక్రవారం తెల్లవారు జామున తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి చెక్కును నాగబాబు కుటుంబ సభ్యులైన తల్లి లక్ష్మి, భార్య సాయిదుర్గ, అన్నలు శ్రీను, దుర్గల సమక్షంలో అందజేశారు. తమ శాఖ ద్వారా అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఆర్వోలు, ఆ ప్రాంత పెద్దలు పాల్గొన్నారు. నాగబాబు ఫార్మా కంపెనీలో పని చేస్తూ గత ఐదేళ్లుగా విశాఖపట్నంలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల అసిస్టెంట్ మేనేజరుగా పదోన్నతి లభించడంతో ఆ విషయం తల్లి, అన్నలకు చెప్పి వెళ్లిన వారం రోజుల లోనే ఈ సంఘటన జరిగింది.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి



ఉప్పాడలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఎంపీ ఉదయ శ్రీనివాస్



సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి పథకం గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న పలు సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల నిర్మాణానికి ప్రభుత్వం వ్యతిరేకం కాదని, పరిశ్రమల ద్వారా ప్రజలకు మత్స్యకారులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉప్పాడ, కోనపాపేట తీర ప్రాంతాలు కోతకు గురి కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. సర్పంచ్ ఉమ్మడి మేరీ, ఉమ్మడి జాను, ఎంపీడీవో వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను ఉప సర్పంచ్ పొన్నగంటి రామకృష్ణ, వార్డు సభ్యులు ఆయనకు వివరించారు.

ప్రజల అవసరాలు గుర్తించేందుకే గ్రామ సభలు

సామర్లకోట: ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అమలు చేయడానికే ప్రతి గ్రామంలోను ఉపాధి హామీ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మండల పరిధిలో అచ్చంపేట, ఉండూరు, పనసపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించడంతో పాటు వారు చేసే పనులు గ్రామ ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల పరిధిలో 18 గ్రామాల్లోను ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ గ్రామ సభలలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కర్రి హరి కృష్ణసత్యారెడ్డి, గ్రామ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజ



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజన్-2047 రూపకల్పనలో గ్రామసభలు కీలకం

జిల్లా కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: విజన్-2047 రూపకల్పనలో గ్రామ సభల నిర్వహణ కీలకమని, గ్రామానికి అవసరమైన పనులను గుర్తించడంతో పాటు ఎలాంటి సమస్యలైనా ఆ సభల్లో చర్చించవచ్చని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ఉపాధి పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త పనుల గుర్తింపునకు నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా శుక్రవారం మండలం చిత్రాడ సచివాలయం వద్ద నిర్వహించిన సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులతో కలసి గ్రామ సమస్యలపై చర్చించారు. జిల్లాలోని 385 గ్రామ పంచాయతీలలోని సమస్యలను గుర్తించి అందుబాటులో ఉ్న వనరులతో సమాజానికి ఉపయోగపడే పనులతో పాటు, వ్యక్తిగత అవసరాలైన స్వయం ఉపాధి, వ్యాపారాలకు అవసరమైన రుణ సదుపాయాలపై చర్చించవచ్చన్నారు. ఉపాధి నిధుల ద్వారా పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ కొత్తలూరి సునీత, మండలం తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

5,642 మీటర్ల పర్వతారోహణ

ఘనత సాధించిన కాకినాడ మహిళ



పర్వతారోహణ చేసిన కోనేరు అనిత

కాకినాడ: కాకినాడకు చెందిన కోనేరు అనిత అత్యంత ఎత్తైన పర్వతారోహణ చేసి ప్రశంసలు అందుకున్నారు. కాకినాడకు చెందిన ఆమె రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురితో కలిసి రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రూస్ పర్వతాన్ని ఐదు రోజుల వ్యవధిలో అధిరోహించి ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 19వ తేదీన పర్వతారోహణ చేసి శుక్రవారం కాకినాడ చేరుకున్న ఆమె 5,642 మీటర్ల ఎత్తైన పర్వతారోహణ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

టంగుటూరికి ఘన నివాళులు



పెద్దాపురంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్ అరుణ తదితరులు

పెద్దాపురం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశభక్తి, పట్టుదల నిశ్వార్థ ప్రజా సేవకుడిగా అందరి మన్ననలు పొందిన ఘనత టంగుటూరిదేనని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళ వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ శుక్రవారం నివాళులు అర్పించారు. ఆయన మన రాష్ట్రానికి ప్రథమ ముఖ్యమంత్రి కావడంపై ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మేనేజర్ అచ్చుతరాజు, కౌన్సిలర్ పితాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



నూకాలమ్మ తల్లి ఆలయంలో భక్తులకు జాకెట్ ముక్క, గాజులు అందజేస్తున్న ఈఓ తదితరులు



నూకాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి శుక్రవారం వరలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆయనతో పాటు గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని చేతుల మీదుగా భక్తులు అమ్మవారి రూపు, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులను పంపిణీ చేశారు. సుమారు రెండువేల మంది మహిళలు ఈ పూజల్లో వరలక్ష్మి వ్రతాలు ఆచరించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కనకదుర్గ, వనదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బంగారు రూపులను అమ్మవారి వద్ద ఉంచి నోములు నోచుకున్నారు. రకరకాల పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

సామర్లకోటలో..

సామర్లకోట: సామూహిక వరలక్ష్మీ వ్రతాల పూజలతో పట్టణం ఆధ్యాత్మికత సంతరించుకుంది. పట్టణ, మండల పరిధిలోని అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక పంచారామ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం వ్రతాలను ప్రారంభించారు. బడేలమ్మ చెరువు వద్ద కొలువైన నవదుర్గ ఆలయంలో ధర్మకర్త విజయ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వచ్చారు. బ్రౌన్‌పేట సెంటర్‌లోని శ్రీ కనక దుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త నూతలపాటి సింహచలం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మండల పరిధిలో వేట్లపాలెం కనకదుర్గ ఆలయంలోను సామూహిక వ్రతాలు నిర్వహించారు.



భీమేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను ప్రారంభించిన ఈఓ నీలకంఠం తదితరులు

నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



వేట్లపాలెంలోని బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేసిన ఆర్డీఓ కిశోర్ తదితరులు

సామర్లకోట: మున్సిపాలిటీల పరిధిలో నీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ ఇట్ల కిశోర్ శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి శుద్ధి జాలల ప్లాంటు నిర్వాహణకు అవసరమైన స్థల సేకరణను ఆయన పరిశీలించారు. కాకినాడ, సామర్లకోట, పిఠాపురం మున్సిపాలిటీలలో, గొల్లప్రోలు నగర పంచాయతీలలో ఈ మేరకు స్థల సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. భూసేకరణ ప్రతిపాదనలు కలెక్టరుకు నివేదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

మంచి చెడులపై విచక్షణ అవసరం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులకు మంచి చెడులపై అవగాహన ఉండాలని ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలో పవర గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ బాలికలను వేధిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏమైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని మహిళా పోలీసు ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ నెలలో జరిగే పరీక్షలకు సంబంధించి సిలబస్ పూరి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చారు. హెచ్‌ఎంలు గాయత్రి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.